చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు

● ఎమ్మెల్యే సబితారెడ్డి


చెరువులో గుర్రపుడెక్కను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని మూడు చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించడానికి తగిన చర్యలు తీసుకోనున్నట్టు మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి తెలిపారు. గుర్రపుడెక్క తొలగించే యంత్రం లేనందున చెరువులు సదరు ఆకుతో నిండిపోతున్నాయని, ఈ దృష్ట్యా వెంటనే యంత్రం పంపించాల్సిందిగా కోరుతూ హెచ్ఎండీయేకు లేఖ రాస్తానని ఆమె పేర్కొన్నారు. శనివారం మునిసిపల్ కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డితో కలిసి ఆమె ఇక్కడి మంత్రాలచెరువు, పెద్దచెరువు, చందచెరువులను సందర్శించారు. ఈ సందర్భంగా చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువులు అధ్వానంగా మారుతున్నా ఎందుకు పట్టించుకోవడంలేదని, చెరువుల పరిసరాల్లో దుర్వాసన వ్యాపిస్తున్నా నివారణ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గుర్రపుడెక్క తొలగించే యంత్రం కోసం హెచ్ఎండీయేకు లేఖ రాస్తానని, సదరు యంత్రం రాగానే ఆకును తొలగింపజేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం లో మునిసిపల్ డీఈఈ వెంకన్న, ఆర్వో చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ మీర్‌పేట్‌శాఖ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు సునీత, పార్టీ నాయకులు బోయపల్లి శేఖర్‌రెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, భరత్, రమణ, జంగయ్య, వీరూరెడ్డి పాల్గొన్నారు.

హిందువుల్లో ఐక్యత పెంపొందేలా పూజలు చేయాలి

● జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు

మన్సూరాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో హిందూ దేవుళ్లపై జరుగుతున్న దాడులు దారుణమని, శబరిగిరీశుడి పూజలతో పాటు హిందూ సమాజంలో ఐక్యత పెంపొందేలా అయ్యప్పస్వాములు ప్రేరేపించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని సహారా రోడ్డులో గల అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారులకు 55 రోజుల పాటు చేపట్టే బిక్ష కార్యక్రమం శనివారం ప్రారంభించారు. నర్సింహారెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రూ.60వేల నగదును విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి మొదలుకొని డిసెంబర్ 26వ తేదీ వరకు చేపట్టే ఈ అన్నప్రసాద వితరణ ఎంతో మంది దాతల సహకారంతో కొనసాగుతుందన్నారు. అయ్యప్ప మాలధారులకు నర్సింహారెడ్డి బిక్షను వడ్డించారు. సత్యప్రియ గురుస్వామి, వివిధ కాలనీల సంక్షేమ సంఘం నాయకులు, అయ్యప్ప మాలధారులు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.


బిక్ష వడ్డిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

మన్సూరాబాద్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నుంచి ప్రారంభమైన అయ్యప్ప మాలధారులకు 55రోజుల పాటు చేపట్టే అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

హెయిర్ స్టైల్‌పై క్రేజ్

● సెలూన్లకు పెరుగుతున్న గిరాకీ

● నెలకు వేల రూపాయలను వెచ్చిస్తున్న యువత





అల్వాల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాలానికి అనుగుణంగా యువత ఫ్యాషన్‌పై మరింతగా దృష్టి సారిస్తోంది. ముఖ్యంగా హెయిర్ కటింగ్ విషయంలో యువతీయువకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నెలకోమాదిరిగా హెయిర్ కటింగ్, షేవింగ్ చేయించుకుంటూ వేల రూపాయలను వెచ్చిస్తున్నారు. దీంతో కార్పొరేట్ తరహాలో ఏర్పాటు చేసిన సెలూన్‌లకు విపరీతమైన గిరాకీ పెరిగింది. సెలూన్‌ల యజమానులు ఒక్కో హెయిర్ స్టైయిల్‌కు రూ.100 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నారు.

షేవింగ్ స్టైల్స్

షేవింగ్ విషయంలో ఫ్రెంచ్, క్రిస్టియన్, ముస్టేచ్ స్టైల్, జాక్‌మన్, చిన్ తదితర పేర్లతో షేవింగ్ చేస్తున్నారు. సెలూన్‌లకు వచ్చే వినియోగదారుడి ముఖ కవళికను బట్టి కూడా షేవింగ్ చేస్తారు.

విభిన్న సెలూన్‌లు

నగర పరిధిలో హెయిర్ సెలూన్‌లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. మామూలు హెయిర్ డ్రెస్సింగ్ సెలూన్‌ల నుంచి మోడ్రన్ హెయిర్ డ్రెస్సింగ్ సెలూన్‌ల వరకు ఉన్నాయి. వాటిలో ప్రధానంగా జావేద్ హబీబ్, నేచురల్స్, లోరియల్స్, గ్రీన్ ట్రెండ్స్, లాక్మే హెయిర్ డ్రెస్సింగ్స్ ఉన్నాయి. హెయిర్ డ్రెస్సింగ్ సెలూన్‌లో ఐజీన్(పరిశుభ్రత) పాటించడంతో పాటు డిస్పోజబుల్ కత్తెరను(ఒకరికి కటింగ్ చేసిన అనంతరం వాటిని పడేస్తారు) వాడతారు. యూవీ(అతినీలలోహిత) కిరణాలతో కూడిన మిషన్‌లలో కటింగ్, షేవింగ్‌లకు సంబంధించిన కిట్‌లను ఉంచుతారు. దీంతో వాటిలో ఉన్న క్రిమికీటకాలు నశిస్తాయి. కరోనా వచ్చినప్పటి నుంచి యువత ఈ తరహా సెలూన్‌లకు వెళ్లడానికి ప్రాధాన్యమిస్తున్నారు.

కటింగ్‌లు

మస్కులైన్ ఎయిర్ స్టైల్, షార్ట్‌స్పికి ఎయిర్ స్టైల్, స్మూత్‌స్పికి, ఫంక్, షార్ట్‌టోఫ్పీ, లాంగ్ హెయిర్ కట్స్, షోల్డర్ లెంత్ హెయిర్, క్యాజువల్ లాంగ్ హెయిర్ స్టైల్, మీడియం లెంత్ లాంగ్ హెయిర్ స్టైల్, బ్యాక్ హెయిర్ స్టైల్, ఫార్వర్డ్ ఫారెన్ హెయిర్ స్టైల్‌తో పాటు వివిధ రకాల కటింగ్‌ల కోసం యువత అత్యాధునిక హెయిర్ డ్రెస్సింగ్ సెలూన్‌లను ఆశ్రయిస్తున్నారు. కేశ సంరక్షణతోపాటు కేశాలను అందంగా మలిచే విధంగా సెలూన్‌ల యజమానులు సైతం ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. సర్టిఫికెట్ ఉన్న హెయిర్ డ్రెస్సింగ్ సెలూన్‌లకే యువత ఎక్కువగా వెళ్తున్నారు. కొన్ని కటింగ్ షాపులకు అపాయింట్‌మెంట్ తీసుకుని మరీ వెళ్తున్నారు. దీన్ని బట్టి ఫ్యాషన్‌పై పెరుగుతున్న ఆదరణను అర్థం చేసుకోవచ్చు.



ఫేషియల్స్

ఒకప్పుడు ఫేషియల్స్ మహిళలు మాత్రమే చేయించుకునే వారు. కాలక్రమేణా మహిళలతో పాటు మగవారు సైతం ఫేషియల్స్ చేయించుకుంటున్నారు. ధర ఒక్కో సెలూన్‌లో ఒక్కో విధంగా ఉంటుంది. మామూలు సెలూన్‌లో రూ.300 నుంచి రూ.1000 ఉండగా, కార్పొరేటర్ తరహాలో ఉన్న సెలూన్‌లలో రూ.1500 నుంచి రూ.3000 వరకు ఉంటుంది. ఫేషియల్స్‌లో ప్రధానంగా గోల్డ్, సిల్వర్, ఫ్రూట్, హనీ ఫేషియల్, వైన్ ఫేషియల్ వంటి వివిధ రకాల ఫేషియల్స్ అందుబాటులో ఉన్నాయి. శరీరతత్వాన్ని బట్టి కూడా ఫేషియల్ చేస్తారు.



అభిరుచికి తగ్గట్టుగా కటింగ్



వెరైటీ హెయిర్ స్టైల్‌కే ప్రస్తుతం యువత మొగ్గు చూపుతున్నారు. అభిమాన హీరో, క్రికెట్ ప్లేయర్‌ల మాదిరిగా కటింగ్‌లు చేయమని సెలూన్‌లకు వస్తుంటారు. వారి అభిరుచికి తగ్గట్టుగా కటింగ్ చేస్తాం. ముఖ్యంగా మహిళలు, యువతీయువకుల కోసం శిక్షణ పొందిన వారితో పలు రకాల కటింగ్‌లను చేస్తాం. గంటల కొద్దీ సెలూన్‌లో కూర్చొని తమ అందాలకు మెరుగులు దిద్దుకుని వెళ్తుంటారు.

- సందీప్, జావేద్ హబీబ్ ఎండీ

ఎమ్మెల్యేలు, కలెక్టర్‌కు పండుగ శుభాకాంక్షలు


కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలుపుతున్న సత్తయ్య

హయత్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర కో- ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మలక్‌పేట ఆస్పత్రి ఏఓ ఉద్యోగ విరమణ


ఏఓ కరుణాకర్‌రావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే బలాల, సూపరింటెండెంట్

సైదాబాద్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ఏరియా ప్రభుత్వ ఆస్పత్రి పరిపాలనాధికారి ఎం. కరుణాకర్‌రావు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఎమ్మెల్యే అహ్మద్ బలాల ముఖ్యఅతిథిగా హాజరై కరుణాకర్‌ను సత్కరించారు. విధి నిర్వహణలో కరుణాకర్ చేసిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. కార్పొరేటర్ మినాజుద్దీన్, సూపరింటెండెంట్ డాక్టర్ త్రిలోకేశ్యాం, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కోటి దీపోత్సవాన్ని జయప్రదం చేయండి : లచ్చిరెడ్డి

వనస్థలిపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస కోటి దీపోత్సవాన్ని జయప్రదం చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. రేణుక రాజేశ్వరీ శక్తిపీఠం జగన్మాత సేవలో మొల్లూరి నవీన్‌శర్మ నేతృత్వంలో అర్కా ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్తీకమాస కోటి దీపోత్సవ కార్యక్రమ పోస్టర్‌ను కార్పొరేటర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏనుగు సింధు తిరుమల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మల్లేష్, హర్ష పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలి : కళ్లెం

వనస్థలిపురం : డివిజన్‌లో జరిగే అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ శారదానగర్‌లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను సంబంధిత అధికారులతో కలిసి కార్పొరేటర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. జలమండలి మేనేజర్ వాహిని, బాలునాయక్, కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమావేశం

ఎల్బీనగర్ : విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 3న విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజనల్ ఇంజనీర్ ఎలక్ట్రికల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివారం ఉదయం అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్(ఆపరేషన్) సరూర్‌నగర్, ఎల్బీనగర్, హయత్‌నగర్ సబ్ డివిజన్ కార్యాలయాలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

శివమాలధారణ దీక్షలు ప్రారంభం

వనస్థలిపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ శివస్వాముల అసోసియేషన్ అధ్యక్షుడు ముద్దగౌని సతీష్‌కుమార్‌గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం సాహెబ్‌నగర్‌లోని ఉమారామలింగేశ్వర ఆలయంలో శివమాలధారణ దీక్షలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శివమాలధారణ స్వాములకు సతీష్‌కుమార్‌గౌడ్ గురుస్వామి ఉచితంగా దీక్షా వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర కార్తీక మాసంలో నేటి నుంచి మాలధారణ స్వాములకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

గురుకులాల్లో కాస్మెటిక్ చార్జీల పెంపు హర్షణీయం

హయత్‌నగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం గురుకులాల్లో కాస్మెటిక్ చార్జీలను పెంచడాన్ని హర్షిస్తున్నట్లు హయత్‌నగర్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్‌ఫేర్ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. విజయలలిత తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల గురుకుల విద్యార్థులకు పోషక ఆహారాన్ని అందించడానికి దోహదపడుతుందన్నారు. కళాశాల తరఫున సీఎం రేవంత్‌రెడ్డికి విద్యార్థులు, అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి : ఉప్పల

మన్సూరాబాద్: విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో ప్రతిభచాటాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. ప్రోకబడ్డీ జూనియర్స్ విభాగంలో తెలంగాణ నుంచి గ్రూప్-సీలో చాంపియన్‌గా నిలిచి త్వరలో పూణె వేదికగా నిర్వహించే జాతీయ స్థాయి ప్రోకబడ్డీకి నాగోల్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో అభినందన సభకు ఉప్పల పాల్గొని విద్యార్థులను అభినందించారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో పదికి పది జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.10వేలు అందజేస్తానని ఆయన ప్రకటించారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, ఫిజికల్ డైరెక్టర్లు శంకర్‌నాయక్, మమత, ఉపాధ్యాయులు రవికుమార్, విమల, వెంకటేశ్, శ్రీదేవి, సుధాకర్, నాయకులు కందికంటి కన్నాగౌడ్, మేకల సత్యనారాయణ పాల్గొన్నారు.


సదర్‌మేళాలో దున్నతో అనిల్‌యాదవ్ తదితరులు


సదర్‌మేళాలో ఎమ్మెల్యేలు తలసాని, పాడి కౌశిక్‌రెడ్డి, యాదవ సంఘం ప్రతినిధులు


దున్నపోతుతో విన్యాసాలు చేయిస్తున్న యాదవ సోదరుడు

యాదవుల ఐక్యతకు ప్రతీక ‘సదర్’

● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

● అలరించిన దున్నపోతుల విన్యాసాలు, కర్రసాములు

మన్సూరాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏటా దున్నపోతుల విన్యాసాలతో నిర్వహించే సదర్ ఉత్సవాలు యాదవుల ఐక్యతకు ప్రతీకని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని నాగోల్‌కు చెందిన దివంగతులు చింతల కృష్ణయాదవ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షుడు, నాగోల్ డివిజన్ అధ్యక్షుడు చింతల కిరణ్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ నేతృత్వంలో శుక్రవారం రాత్రి నాగోల్‌లో సదర్ మహా సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఈటల రాజేందర్‌తో పాటు బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా తదితరులు విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా యాదవ సోదరులు దున్నపోతులతో చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ సభ్యులు దూదిమెట్ల బాలరాజుయాదవ్, పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్, బొంతు శ్రీదేవి, వివిధ పార్టీల నాయకులు, ఇండియా యాదవ మహాసభ సభ్యులు పాల్గొన్నారు.

సైదాబాద్: ఉప్పరిగూడ, చావుని యాదవ సంఘం ఆధ్వర్యంలో చంచల్‌గూడ చౌరస్తాలో, సైదాబాద్ యాదవసంఘం సైదాబాద్ ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి యాదవులు సదర్‌మేళాను ఘనంగా నిర్వహించారు. బ్యాండ్ మేళా, డప్పు వాయిద్యాలు, కర్రసాములు, దున్నపోతులతో నృత్యాలు చేస్తూ యాదవ సోదరులు భారీ ఊరేగింపు నిర్వహించారు. నిజాం కాలం నాటి నుంచి అనవాయితీగా నిర్వహిస్తున్న ఈ సదర్ మేళాలో యాదవులు తమ గేదెలను, దున్నపోతులను రంగు రంగుల పూలు, వస్త్రాలతో ప్రత్యేకంగా అలకరించి మేళ తాళాలతో, నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ మేళాలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పాడి కౌశిక్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, బీజేపీ నేతలు సహదేవ్‌యాదవ్, వీరేందర్‌బాబు ఉప్పరిగూడ, చావుని యాదవ సంఘం ప్రతినిధులు సంపత్ యాదవ్, నిరంజన్‌యాదవ్, రాంపాల్‌యాదవ్, శ్రీనివాస్ యాదవ్, సైదాబాద్ యాదవ సంఘం ప్రతినిధులు మైల్‌కోల్ మహేందర్‌యాదవ్ శ్రీశైలంయాదవ్ పాల్గొన్నారు.


సదర్ మహా సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, చిత్రంలో మధుయాష్కీగౌడ్, సామ రంగారెడ్డి, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు

జిల్లెలగూడలో..

సరూర్‌నగర్: మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో శుక్రవారం రాత్రి యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరినారాయణకాలనీ, లక్ష్మీనర్సింహకాలనీ, మిథిలానగర్, వివేకానందచౌరస్తా, జిల్లెలగూడ పాత గ్రామం తదితర ప్రాంతాల్లో శ్రీకృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ మేళా నిర్వహించి దున్నపోతులతో ఊరేగింపు జరిపారు. అఖిలభారత యాదవ మహాసభ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, దున్నలను అందంగా అలంకరించిన యాదవ సోదరులను గొల్ల రుమాలుతో సన్మానించి మెమెంటోలు అందజేశారు. టీపీసీసీ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మధు, కార్పొరేటర్లు సిద్దాల లార్స్ బీరప్ప, ధనలక్ష్మీరాజ్‌కుమార్, శ్రీనివాస్‌యాదవ్, యాదగిరి పాల్గొన్నారు.

యువకుడిపై రౌడీషీటర్ గ్యాంగ్ దాడి

సైదాబాద్, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రాంలో స్టోరీ పోస్టు చేసిన ఓ యువకుడిని రౌడీషీటర్‌తో పాటు అతడి స్నేహితులు దారికాచి అడ్డగించి రాయి, పేపర్ కట్టర్‌ దాడిచేసి గాయపర్చి, నగదు దోచుకున్న ఘటన మాదన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. యాఖత్‌పురా చోటచంద్రానగర్‌కు చెందిన ఎస్.వి.విశాల్(21) వృత్తిరీత్యా ఎలక్ట్రానిక్ కార్మికుడు. శుక్రవారం రాత్రి సైదాబాద్‌లో సదర్ వేడుకలను చూసేందుకు యాక్టివా బైక్‌పై వచ్చాడు. తిరిగి శనివారం తెల్లవారుజామున 3.15 గంటల సమయంలో ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో ఇమ్లీకా జాడ్ వద్ద రౌడీషీటర్ సోహైల్‌తో పాటు మరో ఇద్దరు బైక్‌ను అడ్డగించారు. ఇన్‌స్టాగ్రాంలో పోస్టు చేసిన కిషన్ ఓ ఈ స్టోరీపై నిలదీశారు. బలవంతంగా విశాల్‌ను రెయిన్‌బజార్ పీఎస్ సమీపంలో గల్లీలోని మసీదు వద్దకు తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లాక మరో ఇద్దరు యువకులు వీరితో జత కలిశారు. ఐదుగురు కలిసి విచక్షణారహితంగా దాడిచేశారు. రాయితో, కట్టర్‌తో దాడి చేయడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి, విశాల్ జేబులో నుంచి రూ.2500 దోచుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనపై బాధితుడు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కళ్లలో కారం కొట్టి.. చైన్ స్నాచింగ్

హయత్‌నగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కల్లు విక్రయిస్తున్న వ్యక్తితో మాటలు కలిపిన దుండగుడు కళ్లలో కారం కొట్టి చైన్ స్నాచింగ్ చేసిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కోహెడ ప్రాంతానికి చెందిన తాడిచెట్టు భిక్షపతి(74) అంబర్‌పేట నుంచి కోహెడ వెళ్లే దారిలో కల్లు విక్రయిస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం కూడా కల్లు తెచ్చి రోడ్డుపక్కన విక్రయిస్తున్నాడు. మధ్యాహ్నం 2గంటల సమయంలో బైకుపై గుర్తుతెలియని వ్యక్తి భిక్షపతి వద్దకు వచ్చాడు. కల్లు రేటు ఎంత అని మాటలు కలిపాడు. ఎవరూ లేని సమయంలో అదునుచూసి భిక్షపతి కళ్లలో కారం చల్లి మెడలో ఉన్న ఒకటిన్నర తులం బంగారు గొలుసు తెంపుకొని పారిపోయాడు. కాసేపటికి కోలుకున్న భిక్షపతి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

కులగణన ఇంటింటి ‘సర్వే స్టిక్కరింగ్’ పరిశీలన


ఇంటింటి కులగణన సర్వే స్టిక్కరింగ్ పనులను పరిశీలిస్తున్న ఎల్బీనగర్ సర్కిల్ డీసీ సేవా ఇస్లావత్

చంపాపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ జడ్పీరోడ్‌లోని శ్రీరమణకాలనీలో కొనసాగుతున్న ఇంటింటి కుటుంబ సర్వే చేసేందుకు మొదటగా చేపట్టిన స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని శనివారం జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ పరిశీలించారు. సర్వే చేసే ఇళ్లను గుర్తించేందుకు ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇళ్లకు స్టిక్కర్లు వేస్తున్నట్లు, ఈనెల 6 నుంచి ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వే చేపట్టనున్నట్లు డీసీ పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో 51 మంది సూపర్‌వైజర్లు, 600 మంది ఎన్యుమరేటర్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అన్వర్, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో అగ్నిప్రమాదం


అద్దాల మండపం నుంచి ఎగసిపడుతున్న మంటలు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని పద్మావతి గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు, ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి 10.30గంటల సమయంలో ఆలయం లోపల ఉన్న అద్దాల మండపంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడడంతో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో దేవాలయం లోపల నల్లటి పొగతో నిండిపోయింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. కాగా అద్దాల మండపంలో ఎలాంటి దీపాలు వెలిగించలేదని ఆలయ అర్చకులు తెలిపారు. ఇటీవల నగరంలోని పలు హిందూ దేవాలయాలలో జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఈ దాడి జరిగిందా.. లేదా ప్రమాదవశాత్తు విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం చోటు చేసుకుందా అనే కోణాల్లో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు దేవాలయంలో ఉన్న సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.


పూర్తిగా దగ్ధమైన అద్దాల మండపం


చాదర్‌ఘాట్ ఎస్‌ఐ రవిరాజ్‌కు నెమలిని అప్పగిస్తున్న పాన్ షాపు వ్యాపారి అంజద్

జనావాసాల్లోకి జాతీయ పక్షి

చాదర్‌ఘాట్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆజంపురలోని జనావాసాల్లో జాతీయ పక్షి నెమలి శనివారం ప్రత్యక్షమైంది. దీంతో స్థానికులు నెమలిని చూసేందుకు ఎగబడ్డారు. స్థానిక పాన్‌షాప్ వ్యాపారి అంజద్ నెమలిని పట్టుకుని చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు. అనంతరం చాదర్‌ఘాట్ ఎస్‌ఐ రవిరాజ్ జూపార్క్‌లోని అటవీశాఖాధికారులను పిలిపించి వారికి అందజేశారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు

ఎన్టీఆర్‌నగర్‌లో ప్రభుత్వ భూమిని, నీటి కుంటను కాపాడండి

ఎల్బీనగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ సర్వే నంబర్ 9/1లోని ప్రభుత్వ భూమితో పాటు నీటి కుంటను కాపాడాలని తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్, తెలంగాణ జన సమితి ఎల్బీనగర్ ఇన్‌చార్జి కేవీ రంగారెడ్డి కోరారు. శనివారం సరూర్‌నగర్ తహసీల్దార్‌ను కలిసిన తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ గౌడ్, రంగారెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్‌నగర్‌లోని సర్వే నంబర్ 9/1లో దాదాపు 150 ఎకరాలుగా ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయన్నారు. ఈ మొత్తం భూమి దాదాపు కబ్జాకు గురై కేవలం కొద్దిపాటి భూమి మాత్రమే మిగిలి ఉందన్నారు. ఈ భూమి తమదని పేర్కొంటు ఇద్దరు వ్యక్తులు రేకుల షెడ్డు నిర్మించడానికి పోటీ పడుతున్నారని వారు తెలిపారు. ఈ భూమి గురించి గూగుల్‌లో వెతకగా అక్కడ నీటి కుంట ఎన్టీఆర్‌నగర్ కుంట అనే పేరుతో నమోదై ఉన్నదన్నారు. ఈ విషయాన్ని లోతుగా పరిశీలించి ప్రభుత్వ భూమితో పాటు నీటి కుంటను కాపాడాలని వారు కోరారు. కార్యక్రమంలో తెలంగాణ జనసమితి ప్రతినిధులు మారోజు రామాచారి, పోట్లపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

వనస్థలిపురం : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని నారాయణ విద్యాసంస్థల జీఎం గోపాల్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ రాంరెడ్డి కాలనీలోని నారాయణ కాన్సెప్ట్ సీబీఎస్సీ స్కూల్‌లో క్రీడోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల శారీరక దృఢత్వాన్ని పెంపొందించడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపట్ల ఆసక్తిని పెంచుకుని పోటీల్లో రాణించాలన్నారు. పాఠశాల ఏజీఎం రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ అనుసింగ్, అకడమిక్ డీన్ స్వప్న, స్వర్ణవల్లి, పద్మజ పాల్గొన్నారు.